క్లుప్తంగా

నేడు మాధవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

రాయచోటి అర్బన్ : ఈనెల 6వ తేదీన రూరల్ మండలం మాధవరం సచివాలయం – 1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్షను నిర్వహించనున్నట్లు యండపల్లె పీహెచ్‌సీ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వై.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఉచిత వైద్యశిబిరంలో వైద్యులు శారద, దివ్యరాణి, గైనకాలజిస్టు స్రవంతి, జనరల్ మెడిసిన్ స్పెషలిస్టు నాగిరెడ్డితో పాటు కంటి వైద్య నిపుణులు పాల్గొంటారన్నారు. శిబిరంలో 7 రకాల ఉచిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులతోపాటు కంటిఅద్దాలను పంపిణీ చేస్తారన్నారు. వైద్య పరీక్షలు చేయించుకోవాలనుకునే వారంతా శిబిరానికి రావాలని తెలియజేశారు.

సంతకాల సేకరణ

రాజంపేట రూరల్ : దేశవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, మాల మహానాడు ఐక్య వేదిక వంటి ప్రజా సంఘాలు గురువారం పట్టణంలో సంతకాల సేకరణ చేపట్టారు. డిసెంబరు 4వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం ద్వారా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నివేదిక సమర్పించనున్నట్లు వారు తెలియజేశారు. దళితుల సమస్యల పరిష్కరించి, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. ఈ సంతకాల సేకరణలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయండి

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీంను అమలు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ నేతలు తహసీల్దార్ ప్రేమంతకుమార్‌కు గురువారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్‌ను వెంటనే రద్దుచేయాలని, అసెంబ్లీ ఆమోదించిన జీపీఎస్ బిల్లును వెనక్కు తీసుకోవాలన్నారు. తమ సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో బీటీఏ రాయచోటి నేతలు రవిశంకర్, అబ్దుల్ రజాక్, ఎస్.వి. రమణ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

సిద్దవటం : పంట నమోదు ప్రక్రియలో భాగంగా ప్రతి రైతు ఆర్బీకేల్లో ఈకేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు తెలిపారు. మండలంలోని మాచుపల్లె ఆర్బీకేను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కియోస్క్ పనితీరు, ఎరువుల నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించారు. మాచుపల్లె గ్రామ సచివాలయం పరిధిలో ఇంకా 120 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని, ఈకేవైసీ చేయించుకోకపోతే ఈ– పంట నమోదు ప్రక్రియ పూర్తికాదన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రాల సహాయకులు వంశీ, శివ ఫణీంద్ర, క్లస్టర్ వలంటీర్ అనుపమ, రైతులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా మంజూరు

సిద్దవటం : మండలంలోని ఏపీఎస్ విలేకరి దాసరి వెంకటసుబ్బయ్య సెప్టెంబర్ 16న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు వైఎస్ఆర్ బీమా రూ. 5లక్షలు మంజూరైందని సిద్దవటం గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన మృతి చెందిన రోజు రూ. 10 వేలు అందజేశామన్నారు. మిగిలిన రూ. 4,90,000 నగదుకు సంబంధించి బీమా పత్రాలను ఆయన కుటుంబానికి గురువారం ఇంటి వద్దకు వెళ్లి అందజేశామన్నారు. సర్పంచ్ ప్రతినిధి భవనాశి ఓబులయ్య, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు డేవిడ్, మైనార్టీ నాయకుడు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

రాజంపేట: నానో ఆధారిత డ్రగ్ డెలవరీ సిస్టంపై గురువారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. జేఎన్‌టీయూ కాకినాడ ఫార్మసీ హెచ్‌ఓడీ డా.భవాని, చెన్నై మీనాక్షి అకాడమీ రిజిస్ట్రార్ డా.చాముండేశ్వరి, తిరుపతి మహిళా విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డా.సుజాతలు పరిశోధనలపై అవగాహన కల్పించారు. ఫార్మసీకి సంబంధించి పలు అంశాలపై సూచనలు తెలిపారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని చిన్నంపల్లి పంచాయతీ లింగిరెడ్డిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే, జెడ్పీ నిధులతో గురువారం గ్రామంలో రైతుల పొలాల వద్దకు రోడ్డు పనులను డీఈ బాల నరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల నరసింహులు మాట్లాడుతూ దాదాపు రూ. 14 లక్షలు వ్యయంతో చిన్నంపల్లి పంచాయతీలోని రైతుల పొలాలకు వెళ్లే రోడ్డులు వేస్తున్నామన్నారు. సర్పంచ్ సమ్మెట ధనమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గజపతిరాజు, శివారెడ్డి, రమణారెడ్డి, గురువారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పెంచల్ రెడ్డి, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

వన్య ప్రాణులను రక్షించుకుందాం

సిద్దవటం: వన్య ప్రాణులను రక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందని సిద్దవటం డిప్యూటీ రేంజర్ కె. ఓబులేసు తెలిపారు. గురువారం మండల కేంద్రం పరిధిలోని దిగువపేట శ్రీ వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వన్య ప్రాణులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణుల వారోత్సవాల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు అడవుల పట్ల, వన్యప్రాణుల గురించి, వాటి ఉపయోగాల గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ ఎఫ్‌బీఓ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది, పాఠశాల కరస్పాండెంటు వినోద్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యం.. ప్రభుత్వ ప్రాధాన్యం



పుల్లంపేట: శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వవిప్, కొల్లం గంగిరెడ్డి



రాజంపేట: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ మేడా



రాయచోటి అర్బన్: రోగికి మందులను అందజేస్తున్న ఫయాజ్ బాషా

పుల్లంపేట : ప్రతి పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇస్తూ జగనన్న ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు కోరారు. గురువారం మండల పరిధిలోని పీవీజీ పల్లి గ్రామ సచివాలయ పరిధిలోని అనంతయ్యగారిపల్లిలో విజయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, మండల కన్వీనర్ ముస్తాక్, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, స్థానిక నాయకులు విజయ్‌కుమార్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, వైస్ సర్పంచ్ చొక్కా రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, సూరిబాబు, మాజీ సర్పంచ్ రాంభూపాల్ రెడ్డి, తహసీల్దార్ నరసింహరావు, బికె మణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శేఖర్, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశే సీఎం లక్ష్యం

పెనగలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం ముద్రపల్లి పంచాయతీలో సర్పంచ్ శివయ్య నాయుడు అధ్యక్షతన జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఇంటి ముంగిటకే ఆరోగ్యాన్ని తీసుకువచ్చి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కంకణం కట్టుకున్నారని తెలిపారు. ప్రతి పేదవారు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఐదు అంచల పద్ధతిలో వైద్య సేవలు అందించేందుకు ఒక బృహత్తర పథకాన్ని ఆయన సిద్ధం చేశారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి పేదవాడు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని షుగరు ఉన్నవారు కూడా ఇక్కడే మందులు ఉచితంగా పొందాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష

రాయచోటి అర్బన్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని చిత్తూరు మార్గంలో ఫయాజ్ ఫంక్షన్ హాల్‌కు సమీపంలోని వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సుధాకర్ నాయక్, ఆర్ఐ మల్లికార్జున, వైద్యులు జ్యోతి, వసీం అక్రం, శ్రావణి, నాగిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేత ఫయాజ్ అహమ్మద్, మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎంలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

సిద్దవటం : ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సిద్దవటం మండలంలోని వంతాటిపల్లె గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లను, వైద్య శిబిరాలను, ఆయన తనిఖీ చేశారు.

పేద రోగులకు రక్షణ జగనన్న ఆరోగ్య సురక్ష

నందలూరు (రాజంపేట) : నిరుపేద రోగులకు ఖరీదైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అన్ని రకాల వ్యాధులకు ప్రభుత్వం ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి పేద రోగులకు జగనన్న ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీపీ పేర్కొన్నారు. గురువారం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ సృజన, సయ్యద్ అమీర్, కలీం, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం ద్వారా ఆరోగ్యం

ఓబులవారిపల్లె : పౌష్టిక ఆహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని జిల్లా వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ సుంకేసుల రఫీ పేర్కొన్నారు. గురువారం చెన్నరాజుపోడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షుడు టంగుటూరు కృష్ణారెడ్డి, వైద్యాధికారులు దేవేంద్రరెడ్డి, రవికిరణ్, రంజిత్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎస్.సోమవరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం డ్వామా పీడీ మద్దిలేటి పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదబరం రెడ్డి, వడ్డి వెంకటరణరెడ్డి, సర్పంచ్ అనసూయమ్మ, మండల ఉపాధ్యక్షుడు రవీంద్ర నాయుడు, ఎంపీడీఓ నరసింహులు, మాజీ సర్పంచ్ పాల వెంకటరమణ, వైద్యులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పేదవాడు ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం

వీరబల్లె (రాయచోటి టౌన్) : ప్రతి వాడు ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ రెడ్డి అన్నారు. జగనన్న వైద్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లెలో జగనన్న వైద్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీడీఓ మల్లీశ్వరి, మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉమామహేశ్వరరాజు, మండల సచివాలయ కన్వీనర్ ముకుందాపురం నరేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాముల రెడ్డి, సుబ్బరామ రాజు, నారాయణరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



వీరబల్లెలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి



గాలివీడు: మాట్లాడుతున్న ఆవుల నాగభూషణ్‌రెడ్డి

జగనన్నకు చెబుదాంను విజయవంతం చేద్దాం

పుల్లంపేట : పుల్లంపేట మండలంలో ఈనెల 13వ తేదీన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పాల్గొంటారన్నారు. ప్రజలు, అధికారులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

కడపకు వెళ్లి పింఛన్ అందజేత



రామచంద్రయ్యతో వేలిముద్ర వేయిస్తున్న వలంటీర్ సరస్వతి

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణం సాతపల్లెకు చెందిన కట్టా రామచంద్ర గుండెకు సంబంధించిన సమస్యతో కడపలోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో సచివాలయం–2 పరిధిలో పనిచేసే వలంటీర్ లింగంగుంట్ల సరస్వతి బుధవారం కడపకు వెళ్లి రామచంద్రకు పింఛన్ నగదును అందజేశారు. వలంటీర్ చూపిన చొరవను రామచంద్ర కుటుంబసభ్యులతోపాటు గ్రామస్తులు అభినందించారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోండి

లక్కిరెడ్డిపల్లె : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శెట్టిపల్లి సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చిత్తా విజయప్రతాప్ రెడ్డి లక్కిరెడ్డిపల్లి హాస్టల్‌ను విజిట్ చేసి స్థానికంగా నివాసం ఉండాలని చెప్పినా కూడా ఉండలేదని, ఈ ఏడాది జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి ఆన్‌లైన్‌లో 55 మంది బోగస్ అడ్మిషన్లు చేసుకున్నారని ప్రతిరోజూ విద్యార్థులు పది మందికి మించి హాస్టల్‌లో లేరన్నారు. ఈ మూడు నెలల్లో రూ. 2 లక్ష, 31 వేలు ప్రభుత్వ ఖజానాను అధికారులు, వార్డెన్ కలిసి దొంగ బిల్లులు చేయించుకున్నారని ఆరోపించారు. ఈ సంఘటనపై విచారణ జరిపి వారిని సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ నాయకులు బాలరాజు, అశోక్‌లు పాల్గొన్నారు.

హక్కులను సాధించడమే లక్ష్యం



మాట్లాడుతున్న బాస్ అధ్యక్షుడు శివప్రసాద్

రాయచోటి అర్బన్ : అణగారిన వర్గాల ప్రజలను చైతన్యపరచి రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను సాధించడమే లక్ష్యమని బాస్ (భారతీయ అంబేడ్కర్ సేన) అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని ప్రీతం రెసిడెన్సీలో గురువారం బాస్ జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశంలో దళితుల హక్కులు హరించబడుతున్నాయన్నారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తూ మనుధర్మ శాస్త్రాన్ని మళ్లీ జనంపై రుద్దేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందన్నారు. పేరుకుపోయిన ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు పనిచేయకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే మునిగి తేలుతున్నాయన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాలు, అధికారుల దృష్టికి తేవడంలో బాస్ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అంబేడ్కరిస్టులను ఒకే తాటిమీదకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంబేడ్కర్ భావజాలం ఉన్న వారంతా బాస్‌లో చేరి బలపరచాలంటూ కోరారు. సమావేశంలో బాస్ రాష్ట్రనేతలు చంద్రయ్య, ముత్యాల మోహన్, గిన్నెల మనోహర్‌రెడ్డి, రవిశంకర్, సూరి, క్రాంతి, భారత నాస్తిక సంఘం రాష్ట్రనేత పల్లం తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన రాజు విద్యాసంస్థ విద్యార్థులు



సత్తా చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాయచోటి టౌన్ : జాతీయ స్థాయి గణిత ఒలంపియాడ్ ఆర్ఎంఓ పోటీ పరీక్షలలో రాజు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ చాటినట్లు రాజు విద్యాసంస్థల వ్యవస్థాపకుడు చమర్తి సుబ్బరాజు తెలిపారు. ఈనెల 3వ తేదీ రీజనల్ మ్యాథమాటిక్స్ ఒలంపియాడ్–23ను నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల ఫలితాలు ఈ నెల 4వ తేదీన వెలువడ్డాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 257 మంది విద్యార్థులు ఎంపికయ్యారని అందులో అన్నమయ్య జిల్లాలో 9 మంది విద్యార్థులు ఎంపిక కాగా వారందరూ తమ విద్యాసంస్థల నుంచి ఎంపిక కావడం విశేషమన్నారు. ఇలాంటి ఫలితాలు సాధించడానికి తమ సిబ్బందితో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహం చాలా ఉందన్నారు.

దశాబ్దాల నాటి సమస్య పరిష్కారం



క్రేన్ సహాయంతో పాత విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని అమ్మవారిశాల వీధిలో మూడున్నర దశాబ్దాలుగా విద్యుత్ మెయిన్, సర్వీసు వైర్లు తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉండేవి. దీనికి తోడు తరచూ లో ఓల్టేజీ, షార్ట్ సర్క్యూట్ సమస్యలు తలెత్తేవి. మూడవ వార్డు కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్ సమస్యను మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి ద్వారా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. నవరాత్రులు సమీపిస్తున్నందున భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలంటూ ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు గురువారం విద్యుత్ శాఖ అధికారులు అమ్మవారిశాల వీధిలో ఎత్తయిన కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతోపాటు కొత్త విద్యుత్ వైర్లను అమర్చి సమస్యను పరిష్కరించారు. దీంతో అమ్మవారిశాల వీధి ప్రజలు, అమ్మవారి భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

పీలేరును ప్రగతి పథంలో నడిపిస్తాం

పీలేరు : పీలేరును మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో పీలేరు సర్పంచ్‌గా జీనత్‌షఫీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం పీలేరులో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని తెలిపారు. వందపడకల ఆస్పత్రి నిర్మాణం, స్మశాన వాటికలు, పార్కులు, 40 ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు, రెండు ఆర్‌వోబీ నిర్మాణాలు, బైపాస్ రోడ్డు, పలు వీధుల్లో సీసీ రోడ్లు, మరుగునీటి కాలువల నిర్మాణాలు జరిగాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పీలేరు ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదని చెప్పారు. ముఖ్యమంత్రి జగనన్న సారథ్యంలో అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నట్లు తెలిపారు. పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో ఇప్పటికే 10 వేల ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా రెండు వేల పట్టాలు ఇవ్వడానికి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో పంచాయతీ సర్పంచ్‌గా జీనత్‌షఫీ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి సహకారంతో పీలేరును మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో బయోమెట్రిక్ వేయించండి

లక్కిరెడ్డిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం విధానాలకు అనుగుణంగా ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు హాజరు నూరుశాతం ఉండాలని అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల బయోమెట్రిక్‌ను వారు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓలు రమేష్ బాబు, శ్రీనివాసులు, సావిత్రమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

పుల్లంపేట : మండల పరిధిలోని శ్రీ ప్రత్యూష హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వి.రవీంద్ర బాబు గురువారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనందున జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ రెడ్డి సన్మానించారు. కరస్పాండెంట్ కాసల భాను ప్రకాష్, ప్రిన్సిపాల్ చందన్ బాబు ఉత్తమ ఉపాధ్యాయుడు రవీంద్రబాబును అభినందించారు.

గడువు పెంపు

రాజంపేట టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రథమ సంవత్సరం డిగ్రీలో ప్రవేశానికై అడ్మిషన్ ఫీజు చెల్లింపునకు ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆ యూనివర్సిటీ స్థానిక కో–ఆర్డినేటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాల రీత్యా రెగ్యులర్‌గా డిగ్రీ చదవలేకపోయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరానికి అడ్మిషన్ ఫీజు చెల్లింపునకు అక్టోబర్ 20 వరకు గడువుందన్నారు.

గ్రామాల స్వచ్ఛతే ప్రభుత్వ లక్ష్యం



ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : గ్రామాల స్వచ్ఛతే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ నుంచి ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. అలాగే గ్రామాలు, పట్టణాలు స్వచ్ఛంగా ఉండాలంటే ప్లాస్టిక్‌ను నిరోధించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమతమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని గ్రామ స్వరాజ్యానికి పాటుపడాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ మండల నాగేంద్ర, గుంటిమడుగు సుధాకర్ రాజు, మార్కెట్ చైర్మన్ సుబ్బరామరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు పాటుపడాలి



ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, డీపీఓ ధనలక్ష్మిలు పేర్కొన్నారు. స్వచ్ఛతా ఏక్ సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా లక్కిరెడ్డిపల్లె బాలుర ఉన్నత పాఠశాల నుంచి మూడు రోడ్ల కూడలి వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మానవహారంగా నిలిచారు. వీధులలోని చెత్తను ఎత్తివేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రతతో లక్కిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ టౌన్ ఆదర్శంగా నిలిచేలా సమష్టి కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఇంటి బయట చెత్తను వేయరాదన్నారు. పర్యావరణానికి హానికరంగా మారుతున్న ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి, ఎంఈఓ చక్రేనాయక్, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, ఈఓఆర్‌డీ పటాన్నాయక్, ఉప సర్పంచ్ రాజారెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చాన్ బాషా, సుబ్బరాజు, వెంకటరమణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది, జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ పథకాల హరివిల్లు

- సంక్షేమాభివృద్ధిలో సరికొత్త అడుగులు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



సంక్షేమ ఫలాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : సంక్షేమాభివృద్ధిలో సీఎం జగన్ సరికొత్త అడుగులు వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాచపల్లె గ్రామంలోని మంగళపల్లె, చౌటంకి హరిజనవాడ, చిన్న కొండావాండ్లపల్లె, కొలిమివాండ్లపల్లె, నడింపల్లె, రాచపల్లె, కొమ్మూరివాండ్లపల్లె, ఎగువ కొవ్వూరివాండ్లపల్లె, దిగువ కొవ్వూరివాండ్లపల్లె, బాలిరెడ్డిగారిపల్లె, బీదవాండ్లపల్లె, బీదంవాండ్లపల్లె హరిజనవాడలలో శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, సమస్యలపై ఆరా తీస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 98 శాతానికిపైగా అమలు చేయడంతో ప్రతి ఇంటా సంక్షేమ బావుటా ఎగురుతోందన్నారు. సంక్షేమాభివృద్ధిలో సీఎం జగన్ సరికొత్త అడుగులు వేస్తున్నారన్నారు.

ఇన్ని సంక్షేమ పథకాలను ఏ ప్రభుత్వంలో చూడలేదు

ప్రతి పల్లెలో ఇంటింటికీ రెండూ లేక మూడు సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఇన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం జగన్ ప్రభుత్వమేనని, ఏ ప్రభుత్వంలోనూ ఇన్ని సంక్షేమ పథకాలను చూడలేదంటూ ఇంటింటా శ్రీకాంత్‌రెడ్డికి ప్రజలు తెలుపుతున్నారు. ఏ నోట విన్నా సీఎం జగనన్న మేలు మరువలేమంటూ మహిళలు ప్రజలు పేర్కొంటుండడం విశేషం. పండుగ వాతావరణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది.

రైతులకు అన్యాయం జరగకుండా చూడండి

జాతీయ రహదారి నుంచి రామాపురం నీలకంఠ్రావుపేట నుంచి వంగిళ్ల నిర్మితమవుతున్న సోలార్ ప్రాజెక్టు వరకు ఏర్పాటు చేసిన నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో జరిగే భూ సేకరణలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు. పంట పొలాల పరిధిలో రహదారి నిర్మాణంలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గడికోట జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణప్ప విశ్వనాథరెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ ద్వారకనాథరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, పెద్దిరెడ్డి, వైస్ ఎంపీపీలు రవిశంకర్‌రెడ్డి, బాబు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, సర్పంచ్‌లు నాగభూషన్‌రెడ్డి, శివయ్య, సుబ్బయ్య, ఆయూబ్‌ఖాన్, ఆంజనేయులు, రామాంజులు, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సమీక్ష

రాయచోటి నియోజకవర్గంలో నాలుగేళ్ల పాలనలో 8 వేల వ్యవసాయపు విద్యుత్ సర్వీసుల (ట్రాన్స్‌ఫార్మర్ల)ను అందించడం హర్షదాయకమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డితో మండలంలోని రాచపల్లె గ్రామంలో ఆయన సమీక్షించారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రైతులకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను 2 వేలు మాత్రమే అందించిందన్నారు. రైతులకు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహాలపై ప్రమాదకరంగా వెళ్తున్న 33కేవి, 11కేవి విద్యుత్ స్తంభాలు, లైన్లను తొలగింపు పనులను, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ వ్యవసాయపు విద్యుత్ కనెక్షను మంజూరు చేయాలన్నారు. విద్యుత్ ఏఈ వరప్రసాద్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.